

13 నుంచి పోలింగ్ అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సార్వత్రిక ఎన్నికలు-2024లో భాగంగా ఈనెల 13 నుండి 16వ తేదీ వరకు ప్రొసీడింగ్ ఆఫీసర్లకు (పిఓలు) శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్ మీటింగ్ హాల్‌లో సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.శ్రీదేవి, చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య సూపర్వైజర్ల ఆధ్వర్యంలో 13 నుంచి 16వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్ర 6 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. పివికెఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్వామా ఏపీఓ గంగా భవాని, బిసి సంక్షేమ సాధికారత అధికారి ఎస్‌కె.రబ్బానీ బాషా, డ్వామా ఫైనాన్స్ మేనేజర్ చిన్నరెడ్డప్ప, డ్వామా ఏపిడి ఉమావాణి సూపర్వైజర్ల ఆధ్వర్యంలో పిఓలకు పోలింగ్ రోజున నిర్వహించవలసిన అంశాలపై మాస్టర్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరు: ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయనతోపాటు డిఆర్‌డిఏ పిడి తులసి, ఎల్‌డిఎం హరీష్, ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ శ్రీవాణి కిషోర్ కుమార్‌రెడ్డి, జిల్లా సబ్ రిజిస్టర్ ఉషారాణి, దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగసౌజన్య పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై నిలబడినప్పుడే సమజాంలో గౌరవం పెరుగుతుందన్నారు. మహిళలు ఉద్యోగం కంటే వ్యాపారం ద్వారా ఎక్కువగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. పిడి మాట్లాడుతూ జిల్లాలో ఎంఎస్‌లన్నీ లాభాల బాటలో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. బిఎంసియులు ద్వారా రోజుకు 2.75లక్షల లీటర్ల పాలు సేకరించడం జరుగుతుందన్నారు. స్వయం సహాయ సంఘాలు ఏర్పాటుతో మహిళల్లో ఆర్థిక సామాజికంగా చైతన్యం పొందారని, కుటుంబానికి కొంత వరకు ఆర్థిక భరోసా కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేష్, వ్యవసాయ శాఖ డిపిఎం వాసు, జిల్లా సమైక్య అధ్యక్షురాలు సుకన్య, ఏపిఎంలు, వీఓలు మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

యువతకు ఓటు హక్కుపై అవగాహన కలిగించండి

చిత్తూరు అర్బన్ : 18 సంవత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు అయ్యి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించేకునేలా అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక డీఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమం ద్వారా ఎన్నికల్లో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలనే అంశంపై డీఆర్డీఏ, మెప్మా ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాల్లోను యువత ఓటర్లు ఎక్కువగా ఉండే కళాశాలలో ర్యాలీలు, సదస్సులు, ఆటపాటల కార్యక్రమాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఓటు అమూల్యమైనది ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

'ఆధ్యాత్మిక' స్థానాలపై బిజెపి 'కన్ను'

- తిరుపతి బిజెపి ఎంపి సీటు రత్నప్రభకేనా..
- శ్రీకాళహస్తిలో పోటీకి 'కోలా' కుతూహలం
- 'టిడిపి'శ్రేణుల్లో అయోమయం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అభ్యర్థులను తేల్చకనే చివరి వరకూ నాన్చుతూనే ఉంటారు. ఈసారి జనసేన, బిజెపిలతో పొత్తులో భాగంగా సగానికి పైగా సీట్లు తేల్చకనే అయోమయంలో ఉన్నాయి. దీంతో నియోజకవర్గాన్నే నమ్ముకుని రెండు మూడేళ్లుగా పార్టీ ప్రచారం చేస్తున్న ఇన్‌ఛార్జిల్లో టెన్షన్ నెలకొంది. ముఖ్యంగా తిరుపతి, శ్రీకాళహస్తి సీట్లు జనసేన, బిజెపి పొత్తులో భాగంగా ఆ రెండు పార్టీలూ తన్నుకు పోతాయని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే తిరుపతి సీటు జనసేనకేనని పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు ప్రకటించారు. తిరుపతి, శ్రీకాళహస్తి ఆధ్యాత్మిక క్షేత్రాలైన వాటిలో ఒకటి ఖచ్చితంగా తమకు కావాలని బిజెపి పట్టుబట్టడంతో సోమవారం ప్రకటించాల్సిన తుది జాబితా మరోసారి వాయిదా పడింది. 22 గంటల్లోపు ఎప్పుడైనా ఎన్నికల నోటిఫికేషన్ రావచ్చని సోషల్ మీడియాలో ప్రచారం ఊపందుకుంది. ఇప్పటికే శ్రీకాళహస్తిలో బొజ్జల గోపాలక్రిష్ణారెడ్డి తనయుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి రెండేళ్లుగా ప్రచారంలో ఇంటిల్లిపాది దూసుకుపోతున్నారు. ప్రత్యర్థి అభ్యర్థి వైసిపి ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ అతని అక్రమాలను, భూకబ్జాలను ఎండగడుతూ ప్రచారంలో ముందంజలో ఉన్నారు. అయితే బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా ఆనంద్ ఢిల్లీలో మకాం వేసి శ్రీకాళహస్తి సీటు బిజెపికే కేటాయించాలని, తాను పోటీచేసి గెలిచి తీరుతానని కాకా పడుతున్నారు. ప్రచారం కోసం 50 లక్షల విలువైన నాలుగు ప్రచార వాహనాలను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా శ్రీకాళహస్తి



నియోజకవర్గం మొత్తం పోస్టర్లు, బ్యానర్లుతో నిండిపోయింది. కమలం గుర్తుకే మీ ఓటు అంటూ పోస్టర్లు వెలిసాయి. బొజ్జల సుధీర్‌రెడ్డిని గెలిపించాలని అధినేత చంద్రబాబునాయుడు, యువగళంలో నారా లోకేష్ గతంలో ప్రకటించి ఉన్నారు. దీంతో మాజీ ఎంఎల్ఎ ఎస్సీవి నాయుడు కినుక వహించారు. కోలా ఆనంద్‌కు టిక్కెట్ వస్తుందని నియోజకవర్గంలో చర్చ జరగడంతో కోలా ఆనంద్‌కు సీటు ఇచ్చినా మనస్ఫూర్తిగా గెలిపిస్తానని అనుయుయులతో చెబుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. బొజ్జల సుధీర్‌రెడ్డి మాత్రం హైదరాబాద్‌లో కూర్చుని లోకేష్ ద్వారా ఎలాగైనా టిడిపికే ఇచ్చేలా పట్టుబడుతున్నారు. నియోజకవర్గంలో మాత్రం బొజ్జల సుధీర్‌రెడ్డి టిడిపి తరపున, వైసిపి అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డి మధ్యే పోటీ ఉంటుందని చర్చ నడుస్తోంది. బిజెపికి ఇస్తే ఈ సీటు వైసిపికి సునాయాసం అవుతుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. తిరుపతిలో నలుగురు పోటీ పడుతున్నప్పటికీ ఈ సీటు జనసేనకే దక్కనుంది. జనసేనలోకి వెళ్లయినా పోటీ చేయాలని టిడిపి ఆశావాహులు పావులు కదుపుతుండటం గమనార్హం. అలాగే తిరుపతి పార్లమెంట్ స్థానాన్ని బిజెపి తీసుకోవడంతో అక్కడ అభ్యర్థిగా కర్నాటక రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ రత్న ప్రభకు ఇవ్వనున్నట్లు సమాచారం. అయితే ఈ సీటును టిడిపి నుంచి ఆశిస్తున్న మాజీ మంత్రి పనబాక లక్ష్మికి తనకు సీటు కేటాయించకపోతే బిజెపి ఓటమి తథ్యమని బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు.

ఆదర్శ ప్రాయుడు అంబేద్కర్..!

ప్రజాశక్తి - రామకుప్పం




మండల కేంద్రమైన రామకుప్పం పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ అగ్రవర్ణ కులాలు అభ్యున్నతికి ఎనలేని కృషిచేశారని కొనియాడారు. ఆయన విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈనాటి యువత ఆయన ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో ప్రతి ఒక్కరు పేద, ధనిక అనే వర్గాలు లేకుండా రాజ్యానికి వన్నెతెచ్చారన్నారు. కృప్పం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జెడ్పిటిసి నితిన్ రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కోకన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచులు మురళి, రాజగోపాల్ నేతలు కేశవరెడ్డి, చెంగారెడ్డి, భాస్కర్ నాయక్, మురుగేష్, నారాయణస్వామి, వెంకటేష్, సతీష్, సుగుణప్ప పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- పలమనేరు

పలమనేరు పట్టణంలో గత పదిరోజులుగా నీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యను పరిష్కరించాలని సిపిఎం పట్టణ కన్వీనర్ గిరిధర్ గుప్తా, ఓబుల్ రాజు మున్సిపల్ కమిషనర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని గంటాఊరు, బిసి కాలనీ, వైఎస్సార్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, గడ్డురుకాలనీల్లో పది రోజులుగా నీటి సరఫరా లేకపోవడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. వెంటనే కమిషనర్ చొరవ చూసి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే వేసవి నేపథ్యంలో నీటి సమస్యల పునరావృతం కాకుండా తగిన చర్యలుచేపట్టాలని కోరారు.



పాత పెన్షన్ ఇచ్చే వారికి ఓటు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ తప్ప ప్రత్యామ్నాయం లేదని, పాత పెన్షన్ ఇచ్చేవారికి మా ఓటు అని రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు వెల్లడించారు. మంగళవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ కల్పించాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నేతలు మాట్లాడుతూ మన భవిష్యత్తు నిర్ణయించేది మనం ఎన్నుకున్న రాజకీయ నేతలే, కానీ వారి రాజకీయ భవిష్యత్తును నిర్ణయించేది మన ఓటు అని, ఓట్ ఫర్ ఓపిఎస్ నినాదం ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు ఉద్యోగ ఉపాధ్యాయ జీవితాలతో రాజకీయ నాయకులు వివిధ సందర్భాలలో ఇచ్చిన హామీలు మరచి మాట తప్పడం జరిగిందని, ఐక్య ఉద్యమాల ద్వారా పోరాటాలు చేసి పాతపెన్షన్ సాధించాలని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ, ఏపీ టిఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చెంగలరాయ మందడి, ఎస్టీయు జిల్లా అధ్యక్షులు మదన మోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు బి.అరుణ్ కుమార్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మణి గండన్, ఏపిటీఫ్ 257 జిల్లా ప్రధానకార్యదర్శి ముక్తార్ అహ్మద్, ఏపీటిఎఫ్ 1938 జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్, సిపియెస్ ఈయే జిల్లా అధ్యక్షులు సమీర్ బాషా, రుటా జిల్లా అధ్యక్షులు మునీర్ అహ్మద్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేంద్రన్, నాయకులు రెడ్డెప్ప నాయుడు, సరిత, ఏకాంబరం, పార్థసారథి, జగదీష్, సాధన కుమార్, చిరంజీవి, రాజేష్ కుమార్, సురేష్ కుమార్, జయారామన్, హేమాద్రి, సుల్తాన్ దినకరన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ

నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం మంగళవారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో జరిగింది. మేయర్ ఎస్.అముద, కమిషనర్ డాక్టర్ జె.అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు, డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, శోభ, సహదేవన్ పాల్గొన్నారు. స్టాండింగ్ కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించి ఆమోదించారు. అజెండా అంశాల్లో భాగంగా జాతీయ కాలుష్య నియంత్రణ మండలి వారి జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమం కింద 2023- 24 రెండవ దశలో భాగంగా జిల్లా ఇంప్లిమెంటేషన్ కమిటీ వారు ఆమోదించిన పనులను చేయుటకు, నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన కూరగాయల మార్కెట్, జంతు వధశాల, ఎన్టీఆర్ బస్టాండ్, కాసు బ్రహ్మానంద రెడ్డి బస్టాండ్లలో గుత్త వసూళ్ల కోసం నిర్వహించిన వేలం పాటల్లో హెచ్చు పాటదారుడికి గుత్తు వసూలు చేసుకొనుటకు, ప్రభుత్వ ఉత్తర్వులు జీవో ఎంఎస్ నెంబర్ 36 ప్రకారం కేటగిరి వారిగా పారిశుధ్య సిబ్బందికి పెంచిన వేతనాలను చెల్లించుటకు, ఇతర అజెండా అంశాలు, టేబుల్ అంశాలను కమిటీ ఆమోదించింది. సమావేశంలో ఎంఈ గోమతి, ఏసిపీ రామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సీఎంఎం గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్

జగనన్న సమావేశ మందిరం ప్రారంభం



ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: మంచి పనులు చేస్తున్నాం.. మద్దతివ్వమని అడుగుతున్నాం అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధి కీళపట్టులో రూ.34 లక్షల వ్యయంతో నిర్మించిన జగనన్న సమావేశ మందిరంను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నగరిలోనే ఆర్డీవో కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం, ఆర్టీవో కార్యాలయం తెప్పించి స్థానికులు చిత్తూరుకు వెళ్లే పనిలేకుండా చేశామన్నారు. ఆక్సిజన్ ప్లాంటును, డయాలసిస్ సెంటర్‌ను నగరి ఏరియా ఆస్పత్రిలోనే ఏర్పాటు చేశామన్నారు. ఇది ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. ఇన్ని మంచి పనులు చేస్తున్నాం కనుకే మద్దతివ్వమని అడుగుతున్నామన్నారు. ప్రజల మేలు కోసం ఎన్నో బటన్‌లు నొక్కిన జగనన్నకు మద్దతుగా నిలుస్తూ రానున్న ఎన్నికల్లో రెండు బటన్లపై నొక్కి వైస్సార్ కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని చేకూర్చాలన్నారు.

రూ.3కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని గురుకువారిపల్లి పంచాయతీ పరిధిలో ఓవర్ హెడ్‌వాటర్ ట్యాంకులు, సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు, పంచాయతీ భవనం, బస్సు షెల్టర్లు, వైయస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రం తదితర అభివృద్ధి పనులను ఎంపి రెడ్డప్ప, జెడ్‌పి ఛైర్మన్ గోపిందప్ప శ్రీనివాసులు మంగళవారం ప్రారంభించారు. వారి వెంట సీనియర్ వైసీపీ నాయకులు ప్రముఖ పారిశ్రామికవేత్త గురుకువారిపల్లి ప్రకాశ్ రెడ్డి సోదరులు, పూతలపట్టు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా జెడ్‌పి ఛైర్మన్, ఎంపి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో సుమారు రూ.3కోట్లు వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయంటే అది కేవలం వైసిపి ప్రభుత్వం వల్లే సాధ్యమన్నారు. ప్రతిపక్షాలు ఏదో బురద చల్లడానికి విమర్శిస్తూనే ఉన్నాయని అటువంటి వారికి గురుకువారిపల్లి పంచాయతీనే మంచి నిదర్శనమని అన్నారు. గురుకువారిపల్లి పంచాయతీలో పట్లపల్లి గ్రామంలో గురుకువారి చంగల్‌రెడ్డి జ్ఞాపకార్థం ప్రకాష్‌రెడ్డి సోదరులు సొంత నిధులతో బస్ షెల్టర్, పొదుపు సంఘాల సమావేశ భవనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ సిపి.హరిరెడ్డి, ఎంపీపీ గీత హరికృష్ణ రెడ్డి, జడ్పిటిసి భారతి మధు కుమార్, వైస్ ఎంపీపీలు పట్నం ప్రతాప్ రెడ్డి, శోభబాబు రెడ్డి, సచివాలయ కన్వీనర్ శరత్ చంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌టియు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి- యాదమరి: ఎస్‌టియు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రుక్మిణమ్మ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఎస్‌టియు రాష్ట్ర నాయకులు గంటామోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులు చక్కగా రాణిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. అనంతరం ఎంఈవో మహిళా ఉపాధ్యాయులను సన్మానించి మెమోంటోలు బహుకరించారు. హెచ్ఎం లలిత, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు పురుషోత్తం, మదన్ మోహన్‌రెడ్డి, మోహన్, యువరాజ్, గుణశేఖరన్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



కల్యాణం..కమనీయం..!

రూ.20 కోట్లతో టిటిడి కల్యాణ మండపాల ఆధునీకరణ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

పెళ్లంటే నూరేళ్ల పంట.. జీవితాంతం మదిలోనే కాదు.. ఆల్బమ్‌లోనూ అందంగా బంధించే ఓ మధుర జ్ఞాపకం.. కల్యాణాన్ని కమనీయంగా కనుల విందుంగా ఆకర్షనీయంగా నిలిపేందుకు టిటిడి కల్యాణ మండపాలు నూతనంగా ముస్తాబయ్యాయి. రూ.20 కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టి లైట్‌సెట్టింగ్, సెంట్రల్‌ఏసీ, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆకర్షనీయంగా నిలుస్తున్నాయి. సరికొత్త హంగులతో శ్రీనివాస, శ్రీ పద్మావతి కల్యాణ మండపాలు అందంగా ముస్తాబయ్యాయి.

ప్రపంచ ప్రఖ్యాత ధార్మికసంస్థ టిటిడి తన పరిధిలోని సేవలను మరింత సరళతరం చేస్తుంది. తక్కువ ఖర్చులతో సకల సౌకర్యాలతో పెళ్లి వేడుకలను చేసుకునేందుకు దేశ వ్యాప్తంగా 320 కల్యాణ మండపాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. తిరుపతిలో దశాబ్దాల తరబడి వివాహ వేడుకలకు వేదికగా నిలిచిన తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాసపురం వద్దనున్న శ్రీనివాస కల్యాణ మండపాలు, లక్ష్మీపురం సర్కిల్ సమీపంలోని శ్రీపద్మావతి కల్యాణ మండపాలను పూర్తిస్థాయిలో సెంట్రల్ ఏసి చేసి, అధునీకరించాలని టిటిడి భావించింది. అనుకున్నదే తడవుగా ఆధునీకరణ పనులకు టెండర్లను ఆహ్వానించి, కరోనా సమయంలో సైతం పనులను చేపట్టి ఏడాది క్రితం పూర్తి చేసింది. శ్రీనివాస కల్యాణ మండపాల్లో నాలుగు బ్లాక్‌లు, శ్రీపద్మావతి కల్యాణ మండపాల్లో 3 బ్లాక్‌లను సెంట్రల్ ఏసి చేసి, వివిధ రకాల పనులు పూర్తి చేసి, ఆకర్షణీయమైన పెయింటింగ్, ఫర్నిచర్, విద్యుత్ లైట్ సెట్టింగ్‌లతో ఆకర్షణీయంగా సిద్ధం చేసింది. అప్పటి నుంచి రెండు మండపాల్లోని 7 బ్లాక్‌లో నిత్యం పచ్చతోరణం, నిత్యకల్యాణం అనే రీతిలో అక్కడ వివాహ వేడుకలు జరుగుతున్నాయి. ప్రయివేట్, ఇతరాత్ర కల్యాణ మండపాల్లో లక్షలాది రూపాయలు వెచ్చించినా సరైన సౌకర్యాల కల్పన ప్రశ్నార్థకమే. టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న కల్యాణ మండపాల్లో విశాలమైన పార్కింగ్ ప్రదేశం, ఆహ్లాదకరమైన వాతావరణం, నిత్యం జానపద, గోవింద నామాలు, సంకర్తీనలతో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కల్యాణమండపాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. వాస్తవానికి ఈ ఏడు బ్లాక్‌లను ప్రస్తుతం ఉన్న సౌకర్యాలతో నూతనంగా నిర్మిస్తే 300 కోట్ల రూపాయలకుపైగానే ఖర్చు అయ్యేది. టిటిడి అధికారులు దీనిపై చర్చించి, కేవలం అదునీకరణ, సుందరీకరణ పనుల ద్వారా కేవలం 50 కోట్ల రూపాయలతోనే పనులను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. చివరికి అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో కేవలం 20 కోట్ల రూపాయలతోనే పనులు పూర్తి, అధునీకరించిన కల్యాణమండపాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

క్లిక్‌కొట్టు ...కల్యాణమండపాలను పట్టు

గతంలో లాగా కల్యాణ మండపాల బుకింగ్ కోసం ఆఫ్‌లైన్‌లో ఆయా ప్రాంతాల్లోకి తిరగాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు టిటిడి అన్ని కల్యాణ మండపాలను కంప్యూటకరణ చేయడంతో ఆన్‌లైన్‌లోనే, ఆఖరికి చరవాణి (సెల్‌ఫోన్)లోనే కల్యాణ మండపాలను బుక్ చేసుకోవాచ్చు. టిటిడి వెబ్‌సైట్ ద్వారా క్లిక్ కొట్టు కల్యాణమండపాలను పట్టు అనే రీతిలో అతి సులభవంతంగా కల్యాణ మండపాలను బుకింగ్ చేసుకోవచ్చు. కల్యాణ మండపాల అద్దె కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించొచ్చు. కల్యాణ మండపం బుకింగ్ మెసెజ్‌ను మాత్రమే ఆయా కల్యాణ మండపాల వద్ద విధుల నిర్వహించే ఉద్యోగులకు చూపిస్తే సరిపోతుంది.



ఛైర్మన్ సాహసోపేతమైన నిర్ణయం : తేజ, టిటిడి కాంట్రాక్టర్

టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం. దేవస్థానం ఈవో, జేఈవోల పర్యవేక్షణ, ముందుచూపు నిర్ణయాల వల్ల అతి తక్కువ వ్యయంతో శ్రీనివాస, శ్రీపద్మావతి కల్యాణమండపాల్లోని ఏడు బ్లాక్‌లు సెంట్రల్ ఏసితో, ఆధునీకరణ పనులతో, ఏడాది క్రితం అందరికీ అందుబాటులోకి వచ్చాయి.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో

కేంద్ర బలగాలతో కవాత్



ప్రజాశక్తి- శాంతిపురం: శాంతిపురంలో కేంద్ర ఆర్మీ బలగాలతో ర్యాలీని కుప్పం నియోజకవర్గ రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తుమిసి క్రాస్ నుండి బడుమాకులపల్లి సంత వరకు కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో ఎన్నికల జరగనున్న సందర్భంగా ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ఆర్మీ బలగాలతో ర్యాలీని నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలను పాటించాలని, ఈ నిబంధనలో సహకరించాలని తెలియజేశారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండల తహశీల్దార్ మురళీకృష్ణ, రాళ్ళబూదుగూరు ఎస్సై వి.సుమన్, గుడిపల్లి ఎస్సై లక్ష్మీకాంత్, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు, కేంద్ర ఆర్మీ బలగాలు ఉన్నారు.

బైరెడ్డిపల్లి: ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు కేంద్ర బలగాలు (ఎస్ఎస్‌బి) మంగళవారం బైరెడ్డిపల్లిలో కవాత్ నిర్వహించినట్లు గంగవరం సిఐ కృష్ణమోహన్, బైరెడ్డిపల్లి ఏఎస్ఐ వెంకయ్య తెలిపారు. స్థానిక ఇండియన్ బ్యాంక నుంచి వికోట రోడ్డులోని చెక్‌పోస్టు వరకు కవాత్‌ని చేశారు. సిఐ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందకు ఎస్ఎస్‌బి దళాలు మండలానికి చేరుకున్నాయని తెలిపారు.

ఎన్నికల లబ్ది కోసం బిజెపి ప్రయత్నం

నియోజకవర్గ కాంగ్రెస్‌నేత ఎస్.సజ్జద్ బాషా


ప్రజాశక్తి- పుంగనూరు: బిజెపి ఎన్నికల్లో లబ్ది పొందడానికే సిఎఎ మత విభజన చట్టం అమలులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోందని పుంగనూరు నియోజకవర్గ కాంగ్రెస్‌నేత ఎస్.సజ్జద్ బాషా అన్నారు. ఈ చట్టం అమలు చేయడాన్ని మంగళవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఇది కేవలం కొన్ని వర్గాలకు మాత్రమే పౌరసత్వ హక్కులు కల్పించి మిగిలిన వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహిస్తోందని తెలిపారు. ఇది ముమ్మాటికి మత విభజన చట్టమేనని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఈ మత విభజన చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయకుండా వ్యతిరేకించాలని కోరారు. బిజెపి తెస్తున్న ఇటువంటి చట్టాల వల్ల భారత ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ



ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ అందించిన విద్యా సామగ్రిని వైసిపి జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, పులా శంకర్ రెడ్డి మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు రానున్న పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో ఉపయోగపడే విద్యా సామగ్రిని ఎమ్మెల్యే అందించినట్లు తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించి స్కూల్‌కి, తల్లిదండ్రులకు పేరు తేవాలని అన్నారు. హెచ్ఎం క్రిష్ణప్ప, సిఆర్పిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేయూత చెక్కులు పంపిణీ



ప్రజాశక్తి- యాదమరి: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని వారికి ఆర్థికంగా చేయూత అదించేందుకే జగనన్న చేయూత కార్యక్రమాన్ని ప్రారంభించారని మాజీ ఎమ్మెల్యే వైఎస్ఆర్‌సిపి అభ్యర్థి సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని శివపార్వతి కళ్యాణ మండపంలో జగనన్న చేయూత కార్యక్రమం ప్రారంభించారు. సునీల్ కుమార్ మండలంలోని 2849 మందికి 5 కోట్ల 34 లక్షల మెగా చెక్కును అందజేశారు. మండల పరిషత్ అధ్యక్షులు సురేష్, ఉపాధ్యక్షులు హరినారాయణ రెడ్డి రవీంద్ర, సర్పంచ్ ఝాన్సీ పళని, ఎంపీడీవో సింగన్న, ఈవోపీఆర్డి హరి ప్రసాద్‌రెడ్డి, ఏపీఎం కల్పలత రెడ్డి, విద్యాశాఖ అధికారి రుక్మిణి, వెలుగు సీసీలు లక్ష్మీపతి, బాల సుబ్రహ్మణ్యం, వెంకటేష్ పాల్గొన్నారు.

న్యాయవాది పై పోలీసుల దాడిని ఖండిస్తూ

కోర్టు విధులు బహిష్కరణ



ప్రజాశక్తి- నగరి: న్యాయవాదిపై పోలీసుల దాడులను ఖండిస్తూ, పోలీసుల ప్రవర్తన తీరు నశించాలని నగరి బార్ అసోసియేషన్ తరపున మంగళవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం, నారాయణవనం మండలం పోలీస్ స్టేషన్లో ఎస్ఐ పరమేశ్వర్ నాయక్ కచ్చిదారు తరపున హాజరైన నగరి బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయవాది టీ.లోకేష్‌పై దాడిచేసి గాయపరచడం, నింద్ర పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గాంధీ నగరి బార్ అసోసియేషన్ సభ్యులు ఈజీ.బాబు అనే న్యాయవాదితో అసభ్య పదజాలంతో దుర్భాషలాడటాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. భాదితులు, కచ్చిదారు తరపున న్యాయవాదులే హాజరవుతారని, న్యాయవాదులు రాకూడదని, ప్రశ్నించకూడదని అధికార పెత్తనంతో వ్యవహరించడం విడ్డూరమని అన్నారు. బాధితులకు, కచ్చిదారులకు భరోసా న్యాయవాదులే అనే కనీస అవగాహన పోలీసులు తెలుసుకోవాలని, ఇదే విషయాన్ని ప్రతిసారి కూడా కోర్టు వారు పోలీసులకు సూచిస్తున్నా కూడా పోలీసుల ప్రవర్తన తీరులో మార్పు రాలేదని, పోలీస్‌స్టేషన్‌కి వెళ్లిన న్యాయవాదులకి కనీస మర్యాద కూడా ఇవ్వకుండా పెత్తందారుల్లా నడుచుకుంటున్నారని, ఇకనైనా పోలీసులు తమ తీరును మార్చుకోవాలని సూచించారు. నగరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాణిక్య వాసగం, ఉపాధ్యక్షులు వేలాయుధం, కార్యదర్శి జానోజోష్, సహకార్యదర్శి కె.రాము, కోశాధికారి నాగరాజు, సీనియర్ న్యాయవాదులు, మురళీధరన్ మహాదేవన్, జగదీష్, మురళీకృష్ణ, చిరంజీవిలు, ఎం.బాబు, తిరుమల, మదన్, అరుణ్, అనిఫా, వెంకటేష్, ధరణి పాల్గొన్నారు.

జీడీ నెల్లూరు గడ్డపై టిడిపి జెండా ఎగరవేస్తాం..

డిప్యూటీ సీఎంకి పదిరోజులే పదవీకాలం...!
డాక్టర్ థామస్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి



ప్రజాశక్తి వెదురుకుప్పం, ఎస్ఆర్ పురం: మండలంలోని తయ్యూరు గ్రామపంచాయతీ చిన్న తయ్యూరు గ్రామంలో మంగళవారం 'మన ఇంటికి మన థామస్ కార్యక్రమం'లో భాగంగా డాక్టర్ థామస్ ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ పొన్న యుగంధర్ విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు రాబోయే రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తాను గత రెండు నెలలుగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నానని, చాలా మంది యువత ఉన్నత చదువులు చదివి చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని థామస్ అన్నారు. టిడిపి అధికారం చేపట్టిన వెంటనే జిడి నెల్లూరును ఇండస్ట్రియల్ ఏరియాగా తీర్చిదిద్ది కంపెనీలు ఏర్పాటు చేసి యువతు మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. డిప్యూటి సిఎం నారాయణస్వామి అధికారం చేపట్టినప్పటి నుంచి ఎన్నో కుటుంబాలను బాధపెడుతూనే ఉన్నారని, ఆయన గెలవరనే ఆయన కుమార్తె కృపాలక్షికి ఎమ్మెల్యే సీటు ఇప్పించాడని విమర్శించారు. తన కూతురికి ఎమ్మెల్యే సీటు ఇప్పించడం కోసం వైసిపి అధిష్టానం కాళ్లు పట్టుకున్నారని ఆరోపించారు. ఈ సారి వైసిపికి డిపాజిట్ కూడా రాదని, సమయం కోసం ఎదురుచూస్తున్న ఓటర్లు తగిన బుద్ధి చెబుతారని జోష్యం చెప్పారు. మండల అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు, రుద్రప్ప నాయుడు, మునివర్ధన్ నాయుడు, రమేష్, నాగరాజు, వెంకట రమణ, దశరథ, తిరుమలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

'థామస్ మంచికి మారుపేరు'

డాక్టర్ థామస్ మంచికి మారు పేరని అటువంటి వ్యక్తిని వైసిపి నాయకులు విమర్శించడం సరికాదని టిడిపి వెదురుకుప్పం క్లస్టర్ ఇన్‌ఛార్జి పి.మోహన్ మురళి మంగళవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. థామస్ నియోజకవర్గంలో గత రెండు నెలలుగా పర్యటిస్తూ ప్రజల బాధలు తెలుసుకుంటున్నారని, తాము అధికారంలోకి వస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని హామి ఇస్తున్నారని తెలిపారు. అటువంటి వ్యక్తిని నిందించడం సబబు కాదని హితవు పలికారు. మొగిలయ్య, మరకాల కుప్పం సుధాకర్, వరప్రసాద్, షన్ముగం, మురగయ్య, వెంకటాద్రి పాల్గొన్నారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం



సోమలలో..

ప్రజాశక్తి- పూతలపట్టు: మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద మంగళవారం వైసిపి 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కుమారి, జడ్పిటిసి దేవికా, నాయకులు జగదీశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాజరత్నం రెడ్డి, కేక్ కట్ చేసి తినిపించుకున్నారు.

గంగవరం: వైయస్సార్‌పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా గంగవరం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకటే గౌడ జెండా ఆవిష్కరణ చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

సోమల: సోమల బస్టాండ్ కూడలిలోని వైయస్సార్ విగ్రహం వద్ద మంగళవారం 14వ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారీ కేకును కట్ చేసి పలువురికి పంచి పెట్టారు. మాజీ ఏఎంసీ చైర్మన్ అమాస మోహన్, వైస్ ఎంపీపీ ప్రభాకర్, రమణారెడ్డి, వాసు దేవయ్య, రాజారెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: మండల కేంద్రంలో వైఎస్సార్‌సిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక సర్పంచ్ హరిత కుప్పయ్య, జెడ్పిటిసి రమణ ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పండ్లు మిఠాయిలు పంచిపెట్టారు. జనార్ధన్ మనీ, కుప్పయ్య, నెళవాయిబాబు, దిలీప్‌రెడ్డి, హరిరెడ్డి పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: వైసిపి 14 ఆవిర్భవ దినోత్సవం మండలంలోని కరిడివారిపల్లిలో రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జెడ్పిటిసి సోమశేఖర్, కో ఆప్షన్ నెంబర్ ఫిరోజ్ అహ్మద్ పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన



ప్రజాశక్తి- శాంతిపురం: ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో మంగళవారం శాంతిపురం మండలంలోని శివకురుబూరు గ్రామము నందు లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ బాలసుబ్రమణ్యం పాడి రైతులకు దూడల పెంపకం, పోషణ, యాజమాన్య పద్ధతుల గురించి అనగాహన కల్పించారు. లేగ దూడల ప్రదర్శన ఏర్పాటు చేసి సరి అయిన జాతి లక్షణాలు, వయసుకు తగ్గ బరువు, ఆరోగ్యంగా ఉన్నటు వంటి దూడలను గుర్తించి పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులను జడ్పిటిసి శ్రీనివాసులు అందించారు. చిత్తూరు జిల్లా ఉపసంచాలకులు డాక్టర్ మృణాలిని, చెంగుబల్ల ఎంపీటీసీ రమేష్, డాక్టర్ ఆరిఫ్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

నాటు తుపాకులు స్వాధీనం

ఐదుగురు ముద్దాయిలు అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ కేఎస్ మూర్తి

ప్రజాశక్తి- కార్వేటినగరం: అక్రమంగా దాచి ఉంచిన రెండు నాటు తుపాకులను స్వాధీనం చేసుకుని ఐదుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు నగరి డీఎస్పీ కేఎస్.మూర్తి తెలిపారు. మంగవారం స్థానిక సీఐ కార్యాలయం ఆవరణంలో ముద్దాయిలను ఆరెస్టు చూపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ చిత్తూరు ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు గ్రామాలను సందర్శించి నాటుసారా, తమిళనాడు, కర్ణాటకు మద్యం అమ్మకాలు, అసాంఘీక కార్యక్రమాలపై నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో భాగంగా వెదురుకుప్పం మండలం జక్కదొన్న సమీపంలోని నక్కలదిన్నె గ్రామంలో నాటు తుపాకులు ఉన్నట్లు అందిన సమాచారం మేరకు వెదురుకుప్పం ఎస్ఐ వెంకటేశులు గ్రామంలో ఆకస్మికంగా తనిఖీలు చేయడంతో రెండు నాటు తుపాకులతో ఐదుగురు వ్యక్తులు వేటకు వెళ్లుతున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. నాటు తుపాకులను, నిందితులను పట్టుకున్న ఎస్ఐ వెంకటేశులు, సహకరించిన సిబ్బందికి రివార్డులు అందించడం జరుగుతుందన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లయితే వారిపై కేసునమోదు చేస్తామని తెలిపారు. ట్రైనీ డీఎస్పీ పవన్ కుమార్, సిఐ సత్యబాబు పాల్గొన్నారు.

అనాధ శవానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని గాజులపల్లి బైపాస్ రోడ్డు వద్ద అనాధ శవం ఉన్నట్టు పోలీసులు సమాచారం రావడంతో అక్కడి చేరుకని శవాన్ని పరిశీలించారు. అనంతరం సర్పంచ్ వాణి ప్రియ ముస్లిం జేఏసీ సభ్యులు మంగళవారం సమాచారం ఇవ్వడంతో వారు శవానికి అంత్యక్రియలు చేశారు. కానిస్టేబుల్ బాబు కోదండ, ముస్లిం జేఏసీ అధ్యక్షులు ఫిరోజ్ అహ్మద్, కోశాధికారి షంషీర్, సభ్యులు సమీర్, బొబ్బర్, రాజా పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సమావేశం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ అడుసుపల్లె ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎంఈఓ శివరత్నమ్మ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు, బూట్లు, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు అందజేస్తు ఉందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువుల పట్ల శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పిల్లలకు సరైన సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు. పిల్లల చదువులు మధ్యలో ఆగిపోకూడదని ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని అందిస్తూ ఉందని వీటన్నిటిని గుర్తించి పిల్లలను రోజు పాఠశాలలకు పంపించి బాగా చదివే విధంగా ఇంటిలో కూడా వారికి ప్రోత్సాహం అందించాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల కేంద్రంలోని దివిటి వీధిలో మంగళవారం రూ.7లక్షలతో నిర్మాణం చేపట్టే సీసీ రోడ్డు పనులు ఎంపీపీ లతబాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో లక్షలు వెచ్చించి సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేపట్టిన ఘనత కూడా జగనన్నదేనని గుర్తు చేశారు. వార్డుమెంబర్ అంబిక, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని బగళనత్తం, రామకుప్పంలో ఇంటింటికీ తెలుగుదేశం ప్రచార కార్యక్రమాన్ని నేతలు కార్యకర్తలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మినీ మేనిఫెస్టో పథకాలను ఇంటింటా వివరించారు. గడిచిన 5 సంవత్సరాలలో వైసిపి చేసిన అక్రమాలు, దాడులు, దౌర్జన్యాలతో ప్రజలు విసిగిపోయారని రానున్న ఎన్నికల్లో టిడిపిని ఆదరించి చంద్రబాబును గెలిపించాలని పిలుపునిచ్చారు. శ్రీరాములు రెడ్డి ,టీవీ రవి, విజయ్ కుమార్ రెడ్డి, సుబ్రి, బాలరాజు, శ్రీనాథ్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల రథోత్సవం



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని మొగలి గ్రామంలో స్వయంభుగా వెలిసిందు శ్రీ కామాక్షి సమేత మొగిలి శ్వర స్వామి ఏడవ రోజు మంగళవారం రథోత్సవం పై శివపార్వతులు భక్తులకు దర్శనం గావించారు. ఉభయదారులుగా బెంగుళూరుకు చెందిన ఆక్స్‌ఫడ్ డెంటల్ కళాశాల యాజమాన్యం వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి మునిరాజు, సీఐ లక్ష్మయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మహిళలకు వైఎస్సార్ పార్టీతోనే ఆసరా అని పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కార్యాలయంలో వైయస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమం ఏపీ మీరాబాయి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా 4377 మందికి 8కోట్ల 21లక్ష చెక్కును అందజేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి.రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, జడ్పిటిసి సోమశేఖర్, వైస్ఎంపీపీ శిరీష్ రెడ్డి, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ అమర్నాథ్, ఎంపీడీవో శివశంకర్ పాల్గొన్నారు.

మహిళలు మానసిక ఒత్తిడిని అధిగమించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి: మహిళలు పురుషులతో పోలిస్తే రెండు నుంచి మూడు శాతం ఎక్కువ మానసిక రోగాలైన ఒత్తిడికి, ఆందోళనకు గురవుతారని, వీటితో పాటు గర్భాశయ, రుతుస్రావం, హార్మోన్ మార్పిడి వల్ల ఎక్కువ మానసిక రుగ్మతలకు లోనయ్యే అవకాశం ఉంటుందని డాక్టర్ గణేష్ అన్నారు. మహిళలు మానసిక ఒత్తిడిని అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. స్విమ్స్‌లో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, స్విమ్స్ సంచాలకులు ఆర్‌వి కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ, డాక్టర్ వనజాక్షమ్మ, డాక్టర్ నాగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి తదితరులు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని రపారంభించారు. మహిళా హక్కులు, సమానత్వం, సాధికారత, సామాజిక మార్పుపై అవగాహనతో పాటు, వీటి సాధన కోసం ఉద్యమించాల్సిన కర్తవ్యాన్ని వక్తలు వివరించారు. ఇంటా బయట మహిళలు ఎదుర్కొనే సమస్యలు, పునరుత్పత్తి హక్కులు, లైంగిక దోపిడీ విషయాలను తెలియజేశారు. ఆటలు, వ్యాయామం, యోగా మానసిక ఆరోగ్యానికి అవసరమని అన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

సంక్షిప్త వార్తలు

వైసిపి నేతల కబ్జాను అడ్డుకున్న సిపిఎం



ప్రజాశక్తి - రేణిగుంట: కరకంబాడి పంచాయతీ తారకరామ నగర్‌లోని శివాలయ ప్రాంతంలో ప్రజావసరాల కోసం ఉంచిన ప్రభుత్వ స్థలాన్ని తమకు పట్టాలిచ్చారంటూ 12 మంది భూముల్లోకి ప్రవేశించడంతో స్థానిక సిపిఎం నాయకులు, ప్రజలు కలిసి అడ్డుకున్నారు. 2010లో తమకు పట్టాలిచ్చారని జెసిబిలతో భూముల్లోకి ప్రవేశించడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. 2010లో వైసిపి అధికారంలోనే లేదని, ఎంఆర్ఒ వెంకటరమణ ఎలా పట్టాలిస్తారని సిపిఎం నాయకులు ప్రశ్నించారు. విఆర్ఒ సంఘటనా స్థలానికి చేరుకుని పట్టాలను పరిశీలించి రికార్డుల్లో లేవని ప్రకటించారు. స్థానిక ఎంఎల్ఎ చెబితే రేణిగుంట తహశీల్దార్ పట్టా ఇచ్చారని చెప్పుకుంటూ ప్రభుత్వ భూముల్లో ప్రవేశించడాన్ని ఇళ్లస్థలాల పోరాట కమిటి అధ్యక్షులు రాజశేఖర్ ఖండించారు. కరకంబాడి పంచాయతీలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, పేదవాళ్లకు మాత్రం ఇంటి స్థలాలు చూపించడం లేదన్నారు. ఇళ్లు లేని అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చంద్రమౌళి, జ్యోతీష్, రాజా, అభిరామ్, నాగరాజు, ప్రశాంత్, రాధిక పాల్గొన్నారు.

రుయా నాలుగో తరగతి ఉద్యోగుల చర్చలు సఫలం

ప్రజాశక్తి - తిరుపతిటౌన్ : రుయా హాస్పిటల్లో పనిచేస్తున్నటువంటి పర్మినెంట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రుయా యాజమాన్యంతో సిఐటియు నేతల సమక్షంలో మంగళవారం కార్మికులు జరిపిన చర్చలు సఫలం అయ్యాయని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.బాలసుబ్రమణ్యం, కందారపు మురళి తెలిపారు. ఇటీవల అనివార్యంగా సమ్మె బాట పట్టాలని నిశ్చయించుకున్న సందర్భంగా యాజమాన్యం పిలిచి కార్మికులు పెట్టినటువంటి 19 డిమాండ్లపై రెండు గంటల సమయం చర్చించిందన్నారు. ఉద్యోగుల కొరత ఉన్నందున రిక్రూట్‌మెంట్ చేయాలని, కార్మికులపై పనిభారాన్ని తగ్గించాలని, యూనిఫాం కల్పించాలని, ఆరోగ్య రుసుము పర్సంటేజి పెంచాలని, సీనియార్టీ ప్రకారం సార్జెంట్‌ను నియమించాలని, ఎఫ్ఎన్ఒలకు డ్రెస్సింగ్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. రుయా సూపరింటెండెంట్ రవిప్రభ సానుకూలంగా స్పందించారు. నాయకులు కె.వేణుగోపాల్, టి.సుబ్రమణ్యం, రుయా ఆస్పత్రి కార్యదర్శి గురవయ్య, ప్రధాన కార్యదర్శి నరసింహులు, మధు, మునిచంద్ర, మధుబాబు పాల్గొన్నారు.

నేటినుండి శ్రీవాణి ట్రస్టు

డొనేషన్ కౌంటర్ ప్రారంభం

తిరుపతి బ్యూరో : విమానయాన ప్రయాణికుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్టు డొనేషన్ కౌంటర్‌ను తిరుపతి విమానాశ్రయంలో 13వ తేదీ బుధవారం నుంచి పున్నప్రారంభించనున్నారు. గతంలో వలే శ్రీవాణి టిక్కెట్లు విమానయాన ప్రయాణికులకు అందుబాటులో ఉంచనున్నారు. భక్తులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని టిటిడి పేర్కొంది.

'రాజరాజేశ్వరి' ఆశ్రమాన్ని సీజ్ చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : రేణిగుంట రాజరాజేశ్వరి ఆలయ ఆశ్రమాన్ని సీజ్ చేయాలని ఐద్వా, ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు డిఎస్పికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి సాయి లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ గత నెల 19వ తేదీన దయ్యం వదిలిస్తానని చెప్పి 14 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన రాజరాజేశ్వరి ఆలయానికి సంబంధించిన ఆశ్రమ నిర్వాహకుడు కోదండ రామాచారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలన్నారు. మూఢనమ్మకాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. డిఎస్పి స్పందిస్తూ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని, దోషులను వెంటనే అరెస్టు చేస్తామని తెలిపారు. ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీ, రాజేశ్వరి, ఈశ్వరి, సత్యశ్రీ, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, సుభాన్, బాల పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు బహుమతులు ప్రదానం

తిరుపతి టౌన్ : అల్ ఇండియా రైల్వే మన్స్ ఫెడరేషన్ శతాబ్ది ఉత్సవాల సందర్భముగా, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్, గుంతకల్ డివిజన్ లోని అన్ని బ్రాంచులలో క్రికెట్ టోర్నమెంట్లు మార్చ్ 8 ,9 తేదీల్లో అగ్రికల్చరల్ కాలేజీ గ్రౌండ్ నందు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. సదరు మ్యాచ్ కు సంబంధించిన విన్నెర్స్, రన్నర్స్ ట్రోఫీ లను మంగళవారం తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కొప్పాల సత్యనారాయణ చేతి మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ గుంతకల్ డివిషనల్ ప్రెసిడెంట్ కె సుదర్శన్ రాజు, టెక్నికల్ బ్రాంచ్ సెక్రటరీ ఎస్ రవీంద్ర నాయక్, చైర్మన్ నారాయణస్వామి పాల్గొన్నారు.

9వేల మంది ఉద్యోగులకు ఇంటి స్థలాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అతి తక్కువ వ్యవధిలో టిటిడిలో పనిచేస్తున్న 9వేల మందికి పైగా ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇవ్వడంతో తన జీవితం ధన్యమైందని టిటిడి ధర్మకర్తల మండలి అద్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో మంగళవారం మూడో విడత ఇళ్లపట్టాల పంపిణీ పండుగ కార్యక్రమంలో ఛైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈవో ఎవి ధర్మారెడ్డితో కలిసి నాలుగువేల మంది ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇంటి స్థలాల ప్రొసీడింగ్స్ అందజేశారు. ఛైర్మన్ మాట్లాడుతూ 16 ఏళ్ల క్రితం టిటిడి ఛైర్మన్‌గా ఉన్నపుడు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆదేశాలతో టిటిడి ఉద్యోగులకు ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు ప్రయత్నించామన్నారు. రెండోసారి తనకు టిటిడి ఛైర్మన్‌గా వచ్చిన అవకాశం సర్వీసులో ఉన్న ఉద్యోగులతో పాటు, విశ్రాంత ఉద్యోగులకూ ఇళ్లస్థలాలు ఇచ్చేందుకేనని అన్నారు. వడమాలపేట, పాదిరేడు అరణ్యం వద్ద రెండు విడతల్లో 432 ఎకరాల్లో 5,221 మంది ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయించామన్నారు. ప్రస్తుతం ఏర్పేడు మండలం పల్లం వద్ద ఉద్యోగులకు, సర్వీస్ పెన్షనర్లకు, ఫ్యామిలీ పెన్షనర్లకు కలిపి 4000 మంది ఇంటి స్థలాలు కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. ఇంకా మిగిలిపోయిన ఉద్యోగులు, పెన్షనర్లకు అందరికీ తప్పకుండా ఇంటి స్థలాలు కేటాయిస్తామని తెలియజేశారు. అదేవిధంగా టీటీడీలోని కార్పొరేషన్, కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్, ఎఫ్ఎంఎస్ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులందరికీ రు.5 వేల నుండి రూ.20 వేల వరకు వేతనాలు పెంచినట్లు తెలియజేశారు. ఇలాంటి మంచి పనులు చేపట్టేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న టీటీడీ ఈవో ఏవి.ధర్మారెడ్డికి, జేఈవో వీరబ్రహ్మంకు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. ఈవో ఎవి ధర్మారెడ్డి మాట్లాడుతూ కొన్ని పత్రికల్లో వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వడమాలపేట వద్ద లేఔట్ పనుల కోసం రూ.150 కోట్లు వెచ్చించామన్నారు. ఏర్పేడు మండలం పల్లం గ్రామం వద్ద రూ.90 కోట్లు ఇచ్చామన్నారు. ఇప్పటివరకు దాదాపు రూ.240 కోట్లు టీటీడీ ఖర్చు చేసిందని తెలిపారు. ఉద్యోగులు ఇప్పటివరకు రూ.85 కోట్లు టీటీడీకి తిరిగి చెల్లించారని, మిగిలిన ఉద్యోగులందరూ టీటీడీకి సొమ్ము చెల్లించి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవో స్నేహలత పాల్గొన్నారు.

తెలుగు భాషను ఆధునిక తరాలకు అందించండి

ప్రజాశక్తి - క్యాంపస్

తెలుగు భాషలోని మాధుర్యాన్ని, సంస్కృతి సాంప్రదాయాలను ఆధునిక తరాలకు అందించాలని తెలుగు సంస్కృత అకాడమీ ఛైర్‌పర్సన్ డాక్టర్స్ లక్ష్మీ శివపర్వతి పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, భారతీయ భాషా సమితి, న్యూఢిల్లీ, సంస్కృత భారతిల సంయుక్త ఆధ్వర్యంలో చెలికాని అన్నారావు సభా మందిరంలో మంగళవారం భారతీయ భాషా సమ్మేళనంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ తెలుగు భాషను సంరక్షించడం, తెలుగు భాషలో ఉన్నటువంటి గొప్ప గొప్ప గ్రంథాలను, విషయాలను ఆధునిక తరానికి అందించడం, ప్రత్యేకించి సంస్కృత, తెలుగు భాషల్లో పరిశోధన చేయడం ద్వారా సంస్కృత భాషను, తెలుగు భాషను సంరక్షించడమే సంస్కృత, తెలుగు అకాడమీ ప్రధాన లక్ష్యమని వివరించారు. ఇటువంటి చక్కటి సమ్మేళనాన్ని సంస్కృత విశ్వవిద్యాలయంలో నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని, ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉప కులపతిని అభినందించారు.